# నమస్తే తెలంగాణ

## మహబూబ్‌నగర్
### నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, బుధవారం 27 మార్చి 2024 | MAHABUBNAGAR NARAYANPET




ఓటరు చైతన్య ర్యాలీని ప్రారంభిస్తున్నఅద నపుకలె క్టర్‌శి వేంద్రప్రతాప్

# తప్పనిసరిగా ఓటేయాలి

- అవగాహనరా ్యలీలోమ హబూబ్‌నగర్‌అ దనపుక లెక్టర్‌శి వేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 26 : ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనాలని మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో మంగళవారం స్టేడియం నుంచి 5కే రన్ ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించగా.. బస్టాండ్, తెలంగాణ చౌరస్తా, ప్రధాన రహదారి మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటు చాలా విలువైనదని, ప్రతి ఓటరూ పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించుకొని, ఓటింగ్ శాతం పెంచాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనదే అనే విషయాన్ని గుర్తు చేశారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో నవీన్, జిల్లా స్వీప్ కార్యక్రమాల నోడల్ అధికారి శ్రీధర్, జిల్లా క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సామాజిక మానవ శాస్త్రవేత్త ప్రొఫెసర్ డేనియల్ నేజర్స్

# సంప్రదాయాలను పరిరక్షించాలి

- ఫ్రెంచ్ ప్రొఫెసర్ డేనియల్ నేజర్స్

జడ్చర్లటౌన్, మార్చి 26 : మన సంస్కృతీసంప్రదాయాలను పరిరక్షించాలని సామాజిక మానవ శాస్త్రవేత్త, ఫ్రెంచ్ ప్రొఫెసర్ డేనియల్ నేజర్స్ అన్నారు. జడ్చర్లలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజెస్ ఆధ్వర్యంలో సాహిత్యం, సంస్కృతి అనే అంశంపై అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. కళాశాల ప్రినిపాల్ డాక్టర్ అప్పియ చిన్నమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రముఖ జానపద ఆదివాసీ పరిశోధకులు ఆచార్య జయదీర్ తిరుమలరావు, ఆచార్య గూడూరు మనోజ్‌తోపాటు ఫ్రెంచ్ ప్రొఫెసర్ డేనియల్ నేజర్స్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. నలభై ఏండ్ల తెలుగు సాహిత్యం, సంస్కృతులు, పరిశీలన, అధ్యయనంపై వివరించారు. అదేవిధంగా వివిధ ప్రదేశాల నుంచి తాళపత్రాలు, సంగీత వాయిద్యాలను సేకరించి మ్యూజియం ఏర్పాటుకు చేసిన కృషిని పరిశోధకులు జయదీర్ తిరుమల్‌రావు వివరించారు. అలాగే ఆచార్య గూడూరు మనోజ్ పునాది, ఆధారాలు, వర్తమానం, భవిష్యత్ అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ భాషా విభాగాల అధిపతులు డాక్టర్ కల్యాణి, సుభాషిణి, రమాదేవి, సంధ్యారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.


తిరుమలనాథుడి రథాన్ని లాగేందుకు పోటీ పడుతున్న భక్తులు

# కనులపండువగా రథోత్సవం

హన్వాడ, మార్చి 26 : మండలంలోని మాదారం కొండపై వెలిసిన తిరుమలనాథస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారికి పూజలు చేసి కొండపై నుంచి స్వామివార్ల విగ్రహాలను తీసుకొచ్చి రథోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ స్వామివారిని దర్శించుకొన్నారు. నిర్వాహకులు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

# కోనేరులో పడి మహిళ మృతి

హన్వాడ, మార్చి 26 : మండలంలోని మాదారం సమీపంలోని కొండపై ఉన్న తిరుమలనాథస్వామి కోనేరులో ఓ మహిళ పడి మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బుద్ధారం గ్రామానికి చెందిన బాలమణి (45) సోమవారం రాత్రి నిర్వహించిన తిరుమలనాథస్వామి రథోత్సవాన్ని చూసేందుకు వచ్చింది. తెల్లవారుజామున కోనేరులో స్నానం చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కోనేరులో జారిపడింది. ఇది గమనించిన భక్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని బాలమణిని బయటకు తీయగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భర్త కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించినట్లు ఏఎస్సై వెంకటేశ్ తెలిపారు.



- రేపు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
- బీఆర్ఎస్‌కు అధిక సంఖ్యాబలం
- ప్రజాప్రతినిధుల కొనుగోలుకు కాంగ్రెస్ సర్కారు ప్రయత్నం
- గోవా టూర్‌లో డ్యాన్సులతో హోరెత్తిస్తున్న 'హస్తం' నేతలు
- నేరుగా పోలింగ్ కేంద్రాలకు చేర్చేందుకు పక్కాప్లాన్
- పోలింగ్‌కు ఏర్పాట్లు చేసినఅ ధికారులు

# అంతా అజ్ఞాతంలోకి..

మహబూబ్‌నగర్, మార్చి 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శాసన మండలి ఉపఎన్నిక ఉత్కంఠను రేపుతున్నది. గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగనున్నది. పోలింగ్ నిర్వహించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాల్లోని ఏర్పాట్లను మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రవినాయక్ మంగళవారం పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,439 మంది ఓటర్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులు అంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తమతమ ప్రజాప్రతినిధులను శిబిరాలకు తరలించాయి. కాంగ్రెస్ శిబిరంలో ఉన్న కొంతమంది ప్రజాప్రతినిధులు తప్ప తాగి చిందులు వేయడం, ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అధికార పార్టీ ప్రలోభాలకు గురిచేస్తున్నది. భారీ ఎత్తున డబ్బులను ఎర చూపుతున్నట్లు ప్రజాప్రతినిధుల బంధువులకు ఫోన్ చేసి ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. శాసనమండలి ఉపఎన్నికలు ఇరుపార్టీలకు పరీక్షగా మారాయి. కాగా సంఖ్యాబలంలో ఎక్కువ ఉన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను భారీ ఎత్తున కొనుగోలు చేసేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. ఊహించని విధంగా అధికార పార్టీని చిత్తు చేయాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

***పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు..***

మహబూబ్‌నగర్ శాసనమండలి ఉపఎన్నికకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలోని పది కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా, డివిజన్, నియోజకవర్గ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏ కేంద్రంలో ఎంతమంది ఓటర్లు ఉన్నారో ఆ వివరాలను ఇప్పటికే పోలింగ్ అధికారులకు అందజేశారు. బ్యాలెట్ పద్ధతిన నిర్వహించే ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమంలో ఓటు చేసే అవకాశం ఉన్నది. కాగా, మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్లపై దృష్టి సారించారు.

***ఉప ఎన్నికలకు భారీ బందోబస్తు..***

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న శాసనమండలి ఉప ఎన్నికలకు ఆయా జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించారు. ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక పోలీసు బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. అంతేకాకుండా పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్నతాధికారులతో కలిసి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు కలిగిన ప్రజాప్రతినిధులను మాత్రమే అనుమతించనున్నారు. రెండు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాలతోపాటు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను సీల్ చేసి ఉమ్మడి జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ హాల్‌కు భారీ బందోబస్తు మధ్య తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

### ప్రలోభాలపై కాంగ్రెస్ ఫోకస్..

రాష్ట్రంలో అధికారం చేపట్టాక తొలి ఉపఎన్నిక కావడంతో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురి చేసే అవకాశం కనిపిస్తున్నది. డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేసైనా సరే గెలవాలనే ఉద్దేశంతో ఏకంగా పారిశ్రామికవేత్తను రంగంలోకి దింపింది. దీంతో ఓటుకు రూ.లక్షలు పలుకుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. కాగా కాంగ్రెస్, బీజేపీ ప్రజాప్రతినిధులు గోవా టూర్‌లో ఎంజాయ్ చేస్తున్న వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తప్పతాగి డ్యాన్సులు చేస్తున్న ఈ వీడియోలపై జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉపఎన్నిక ద్వారా ఎలాంటి సంకేతం ఇస్తున్నారని సెటైర్లు వేస్తున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీకి చెక్ పెట్టేందుకు బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

### షాక్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ స్కెచ్..

మహబూబ్‌నగర్ శాసనమండలి ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇచ్చేందుకు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు భారీ స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నేతల ప్రలోభాలకు గురికాకుండా తమ ప్రజాప్రతినిధులందరినీ బీఆర్ఎస్ నేతలు శిబిరాలకు తరలించారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల పర్యవేక్షణలో అధికార పార్టీని ఎలా ఢీకొనాలి అనేదానిపై చర్చలు జరుపుతున్నారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి మాజీ ఎమ్మెల్యేలకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. దీంతో వారి పర్యవేక్షణలో ప్రజాప్రతినిధులను ప్రలోభాలకు గురి కాకుండా అధికార పార్టీకి చెక్ పెట్టేందుకు బీఆర్ఎస్ నాయకులు సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్సీని గెలిపించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు బహుమతిగా అందించాలని, ఇందుకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, అభ్యర్థికి మధ్య ఉన్న విభేదాలు కలిసి వస్తాయని భావిస్తున్నారు.


పీయూ ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం నాయకులు

# హైకోర్టు పనులను అడ్డుకుంటాం

- అగ్రికల్చర్ యూనివర్సిటీలో హైకోర్టు నిర్మాణం సిగ్గుచేటు
- ప్రకృతి సంపదను విచ్ఛిన్నం చేయడం సరికాదు
- పాలమూరు యూనివర్సిటీ బీఆర్ఎస్వీ కన్వీనర్ భరత్
- పీయూ గేటు వద్ద నిరసన

పాలమూరు, మార్చి 26 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయం వల్ల రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలోని వంద ఎకరాల స్థలంలో హైకోర్టు నిర్మాణం చేపట్టడం సిగ్గు చేటని, బుధవారం జరిగే శంకుస్థాపనను అడ్డుకుంటామని పాలమూరు యూనివర్సిటీ బీఆర్ఎస్వీ కన్వీనర్ గడ్డం భరత్‌బాబు ప్రకటించారు. మంగళవారం పీయూ ప్రధాన ద్వారం ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ప్రకృతి సంపదను హైకోర్టు నిర్మాణం పేరుతో విచ్ఛిన్నం చేయడం సరికాదన్నారు. హైదరాబాద్ పరిసరాల్లో ఎక్కడా స్థలం దొరకలేదా అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని అభివృద్ధి చేయడం కోసమే హైకోర్టును యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్నారని, కొన్ని నెలలుగా ఇక్కడ హైకోర్టు నిర్మాణాన్ని ఆపివేయాలని చేస్తున్న నిరసనలను పట్టించుకోకుండా రేపు హైకోర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్నారన్నారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని విద్యార్థులు, మేధావులు, ప్రజాసంఘాలు అందరూ వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు. ఏదేమైనా రేపు జరిగే శంకుస్థాపన పనులను తాము అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.

కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు మహేశ్, పూర్ణచంద్రారావు, శివ, ఈశ్వర్, రవీందర్, సాయికుమార్‌నాయుడు, వెంకటలక్ష్మి, ఉమేశ్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# పుట్టెడు దుఃఖంతో..

- బ్రెయిన్ స్ట్రోక్‌తో తండ్రి మృతి
- టెన్త్ పరీక్షకు హాజరైన కూతురు


పరీక్షకు హాజరైన పావని

చారకొండ, మార్చి 26 : మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన కడారి తిరుపతయ్యకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఐదు రోజుల కిందట హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అతని కూతురు పావని అదే గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతూ ప్రస్తుతం వార్షిక పరీక్షలు రాస్తున్నది. తండ్రి మృతి చెందడంతో పుట్టెడు దుఃఖంతో పరీక్ష రాసింది. అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నది.

# ఘనంగా శకటోత్సవం

బిజినేపల్లి, మార్చి 26 : మండలంలోని వట్టెం గ్రామంలో స్వయంభువుగా వెలసిన నారదగిరి లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయడంతోపాటు ఎడ్ల బండ్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా శకటోత్సవం, ఉద్దాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పారువేట, తెప్పోత్సవ కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రత్నయ్య, సీతారామయ్య, అమృత్‌రెడ్డి, నర్సింహారెడ్డితోపాటు భక్తులు పాల్గొన్నారు.


ఎడ్ల బండ్లపై ఊరేగింపుగా వస్తున్న ప్రజలు

# ఈత.. గుండెకోత

- ప్రారంభమైన ఒంటిపూట బడులు
- సరదా కోసం ఈతకు వెళ్లి విగత జీవులుగా మారుతున్న చిన్నారులు
- గద్వాల జిల్లాలో ఎనిమిది రోజుల్లో ముగ్గురు బలి
- కడుపుకోతతో తల్లిదండ్రుల రోదన



గద్వాల, మార్చి 26 : వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పాఠశాలలకు ఒంటి పూట బడులు నిర్వహిస్తుండగా.. విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎండవేడిమి నుంచి సేదతీరేందుకు విద్యార్థులు బావులు, చెరువుల వైపు పరుగులు తీస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఒకరిని చూసి మరొకరు సరదాగా ఈత కొడుతూ నీట మునిగి మృత్యువాత పడుతున్నారు. దీంతో తల్లిదండ్రులకు కడుపుకోత తప్పడం లేదు. విద్యార్థులు ఒంటి పూట బడులు ముగిసిన తర్వాత మధ్యాహ్నం ఆటపాటలతో సరదాగా గడపొచ్చనే ఉత్సాహంతో ఎక్కువగా ఈత నేర్చుకోవడం కోసం బావులు, చెరువుల వద్దకు వెళ్తుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులే ఎక్కువగా ఈతకు వెళ్లి మృత్యువాత పడుతున్నారు. చాలా మంది పిల్లల తల్లిదండ్రులు పొలం పనుల్లో నిమగ్నమై ఉంటారు. దీంతో చెప్పేవారు లేక ఆటలు ఆడటం, అనంతరం స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లడం చేస్తుంటారు. వీరికి అవగాహన లేకపోవడం వల్ల ఇష్టారీతిలో ఈత కొడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో భారీ జలాశయాలు (జూరాల, సుంకేసుల ప్రాజెక్టులు, రిజర్వాయర్లు), చెరువులు, కాల్వలతోపాటు బావుల్లో సైతం ఈత కోసం విద్యార్థులు వెళ్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.



## గతేడాది నలుగురు మృత్యువాత..

గతేడాది వేసవి కాలంలో ఒంటి పూట బడులు రావడంతో ఈతకు వెళ్లి నలుగురు మృత్యువాత పడ్డారు. అయిజ మండలంలోని తూంకుంటకు చెందిన రాముడు తన కూతురు వెన్నెలకు ఈత నేర్పించడానికి వెళ్లి ప్రమాదవశాత్తు తండ్రీకూతురు మృతి చెందారు. ఇటిక్యాల మండలానికి చెందిన శేషన్న అనే బాలుడు గద్వాల మండలం సంగాల చెరువు సమీపంలో గొర్రెలను కాపాడే క్రమంలో బురద గుంటలో పడి మృతి చెందాడు. గద్వాల మండలం ఈడ్గోనిపల్లికి చెందిన మల్లేశ్ గొర్రెలకు నీరు తాగించేందుకు చెరువు దగ్గరకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు.

**ఈ సారి ఎనిమిది రోజుల్లోనే ముగ్గురు..**

ఒంటి పూట బడులు ప్రారంభమైన ఎనిమిది రోజుల్లోనే జిల్లాలో ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. గత శనివారం(మార్చి 16న) అయిజ మండలం మూగోనిపల్లికి చెందిన విద్యార్థి నరేశ్ స్నేహితులతో కలిసి వ్యవసాయ పొలం సమీపంలో ఉన్న బావిలో ఈతకు వెళ్లాడు. బావిలోకి దూకి మృత్యువాత పడ్డాడు. అది మరువక ముందే బుధవారం(మార్చి19న) మల్దకల్ మండలం ఉలిగేపల్లి గ్రామానికి చెందిన బోయ హుస్సేన్ కొడుకు వీరేశ్(13) మధ్యాహ్నం స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లాడు. సాయంత్రం వరకు కుమారుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానంతో బావి దగ్గకు వెళ్లి చూడగా.. నీటిలో శవమై కనిపించగా తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. అదే విధంగా శనివారం(మార్చి 23న) అయిజ మండలం చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన దేవేందర్‌గౌడ్ కుమారుడు భూపతిగౌడ్ ఇంటర్ చదివిన విద్యార్థి గుడికి వెళ్లే క్రమంలో బావిలో స్నానం చేయడానికి వెళ్లి మృత్యువాత పడ్డాడు.

### తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఈత సరదా విషాదం కాకూడదు. తల్లిదండ్రులు పిల్లలను జలాశయాలు, కాల్వలు, చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈత వచ్చిన వారి సంరక్షణలోనే చిన్నారులు ఈత నేర్చుకోవాలి. స్కూల్‌కు వెళ్లిన పిల్లలు సాయంత్రం వరకు ఇంటికి రాకపోతే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలి. ఈతకు వెళ్లేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో కళాజాత బృందాల ద్వారాఅ వగాహన కార్యక్రమాలు చేపడుతాం.

*- రితిరాజ్, ఎస్పీ, జోగుళాంబ గద్వాల జిల్లా*

